క్లుప్తంగా

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్

అమలాపురం టౌన్: సత్యసాయి సేవా సంస్థలు ఇటీవల రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో అమలాపురానికి సంబంధించి విజేతలైన విద్యార్థులు ఎం.నవ్యశ్రీ, కె.నిత్య తేజస్విని, జి.రజనికి శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం



జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకార సంఘంలో జన ఔషధి కేంద్రాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు శుక్రవారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ, 50 నుంచి 90 శాతం రాయితీతో నాణ్యమైన మందులను ప్రజలకు అందించేందుకు జన ఔషధి కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, కొమరగిరిపట్నం-1 సొసైటీ చైర్మన్ అల్లూరి సురేష్‌రాజు, ఉప సర్పంచ్ గుర్రం శ్రీను, సొసైటీ డైరెక్టర్లు పులుసుగంటి గంగాధర్, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కుడుపూడి శ్రీను, నామన బాల భాస్కర సిద్ధాంతి పాల్గొన్నారు.

ఎస్సైగా జోషి బాధ్యతల స్వీకరణ



ఉప్పలగుప్తం: కొత్త సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.మనోహర జోషి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురం టౌన్ ఎస్సైగా పని చేసి, బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేసిన జి.వెంకటేశ్వరరావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది వెళ్లారు. స్టేషన్ సిబ్బంది ఎస్సై జోషికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, అభినందనలు తెలిపారు.

ఎస్టీయూ పట్టణ శాఖ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ఎస్టీయూ నూతన కార్యవర్గం స్థానిక మద్దాలవారి పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ పట్టణ గౌరవాధ్యక్షుడిగా కొల్లు సత్యనారాయణ, అధ్యక్షుడిగా నక్కా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బొరుసు రమాకాంత్, ఆర్థిక కార్యదర్శిగా పట్నాల రవికుమార్, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎస్ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా రొక్కాల దుర్గ, అభయ్ కన్వీనర్‌గా సుదర్శనరాజు, జిల్లా కౌన్సిలర్లుగా ఎంఎస్ఎస్ మూర్తి, ఎస్.గోపిరాజు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, జిల్లా ప్రతినిధులు నల్లి ప్రసాద్, ఎస్ఎస్ పల్లంరాజు, చిక్కం మైనర్‌బాబు, ఫ్యాప్టో చైర్మన్ ఎన్.శివప్రసాద్ పాల్గొన్నారు.

మసీదు నూతన కార్యవర్గం



యానాం మసీదు నూతన కార్యవర్గ సభ్యులు

యానాం: జామియా మసీదు నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎస్‌కే జిలాని ఎన్నికయ్యారు. స్థానిక మసీదు వీధిలో ఉన్న మసీదులో గత కార్యవర్గం కాల పరిమితి పూర్తవ్వడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ కరీమ్, సెక్రటరీగా రిజ్వాన్, జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ గౌస్‌మొహిద్దీన్, ట్రెజరర్‌గా జిలాని ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులపై ఫిర్యాదు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఓ ఇంట్లోకి చొరబడడంతో, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వీధిలోని ఓ ఇంటి పైఅంతస్తులో ఒక కుటుంబం నివసిస్తోంది. ఆ కుటుంబీకులు పక్కింటికి వెళ్లారు. అదే సమయంలో ఒడిషా రాష్ట్రానికి చెందిన ఓ మహిళ, ఆమె ఇద్దరు చిన్న పిల్లలు, ఆమె తమ్ముడు వారి పైఅంతస్తులోకి వెళ్లారు. ఇది గమనించిన కుటుంబీకులు వారిని నిలదీశారు. తెలుగు మాట్లాడలేకపోతున్న ఆ వ్యక్తులు.. మంచి నీళ్ల కోసం వచ్చామని బదులిచ్చారు. వారిపై అనుమానంతో ఆ వీధికి చెందిన మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని, అపరిచిత వ్యక్తులను విచారణ చేసేందుకు పోలీసు స్టేషన్‌కు తరలించారు.



ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగుర వేసిన జిల్లా ఎస్పీ శ్రీధర్



ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రిలో జెండా ఎగుర వేస్తున్న వైద్యాధికారి దయానా



నగర పంచాయతీ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న కమిషనర్ లోవరాజు



అమలాపురంలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వైద్య విధాన పరిషత్ వైద్యులు



ఐ.పోలవరం జెడ్పీ పాఠశాలలో దేశ నాయకుల వేషధారులతో ఉపాధ్యాయులు



మెగళ్లమూరులో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీ అనురాధ

మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండాను ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

అమలాపురం టౌన్: భారత గణతంత్ర వేడుకలు మిన్నంటాయి. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు.. ఇలా అన్నిచోట్లా జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ప్రాంగణంలోని భరత మాత విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ పట్టణ అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారాలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య విధాన పరిషత్‌కు చెందిన నలుగురు వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. అమలాపురం బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల వేదికపై వీరు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వైద్య విధాన పరిషత్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి, రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు, అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ డాక్టర్ విజయ్ కుమార్, పేథాలజిస్ట్ డాక్టర్ అన్నపూర్ణ, కొత్తపేట సీహెచ్‌సీ డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రకాష్ ఈ పురస్కారాలు అందుకున్నారు. వీరిని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అభినందించారు.

గణతంత్ర వేడుకల్లో ఎంపీ అనురాధ

అల్లవరం: మెగళ్లమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎంపీ చింతా అనురాధ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వతంత్ర సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సర్పంచ్ రాయుడు విష్ణు, కార్యదర్శి రాజ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. గణతంత్ర స్ఫూర్తితో పోలీసులు మరింత సమర్థంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కోర్టుల ప్రాంగణంలో..

స్థానిక కోర్టుల ప్రాంగణంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మేజిస్ట్రేట్ హిమబిందు, స్పెషల్ మేజిస్ట్రేట్ పీపీ ప్రసాదరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పలు గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, రూరల్ సీఐ కార్యాలయం వద్ద సీఐ వీరబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీలో, కామనగరువు పంచాయతీ వద్ద గణతంత్ర వేడుకలు జరిగాయి.

ముమ్మిడివరం: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. తమ కార్యాలయాల్లో డీఈఓ కె.కమలకుమారి, ఎంపీడీఓ జె.రాంబాబు,, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, ఎస్సై డి.సురేష్‌బాబు, ఐసీడీఎస్ కార్యాలయం, సబ్ ట్రెజరీ అధికారి, ఫైర్ ఆఫీసర్, విద్యుత్ ఏడీఏ కార్యాలయం, సబ్ పోస్టాఫీసు, ప్రభుత్వాస్పత్రి, బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంలు జాతీయ జెండాను ఎగుర వేశారు. ఎంపీపీ కోలా గంగాభవాని, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి జాతీయ జెండాను ఎగురవేశారు. పాతయింజరం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎస్.రాజేష్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీలు, టి.కొత్తపల్లి సీహెచ్‌సీ వద్ద ఆయా డాక్టర్లు పతాకావిష్కరణ చేశారు. మురమళ్ల ఇరిగేషన్ కార్యాలయం, గ్రామ సచివాలయాల వద్ద, ఆర్‌బీకేల వద్ద, పంచాయతీ కార్యాలయాల వద్ద వేడుకలు జరిగాయి. జిల్లా, ప్రాథమిక పాఠశాలల్లో ఆయా విద్యా కమిటీల చైర్మన్లు, హెచ్ఎంలు జెండాను ఎగుర వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అంబేడ్కర్ విగ్రహాల వద్ద జెండావిష్కరణ చేశారు.

తాళ్లరేవు: గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.అనుపమ జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి. సీతారామపురంలోని రిలయన్స్ దివ్యాంగుల పాఠశాల వేడుకల్లో తహసీల్దార్ ఎస్.పోతురాజు పాల్గొని, దివ్యాంగ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కోరంగి కైట్ కళాశాలలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పాల్గొన్నారు.

అల్లవరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాంబశివప్రసాద్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ పతాకావిష్కరణ చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు. ఓడలరేవు హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, సచివాలయాల వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వీరవెంకట సత్యనారాయణ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, బొమ్ము బాలవేణి, మల్లాడి మంగాయమ్మ, ఎంపీటీసీ మౌనిక, ఎంపీడీఓ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గణతంత్ర దినోత్సవ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలు ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్, ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.

యానాం: గణత్రంత దినోత్సవ వేడుకలను స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శాంతిక పోతాలు, మూడు రంగుల బెలూన్లను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం ఎగురవేశారు. అనంతరం వివిధ దళాలు, పోలీస్, ఐఆర్‌బీ, హోంగార్డ్స్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కవాతు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖర్, విద్యా శాఖ అధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, సీఐ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ అయ్యప్పనాయుడు



అమలాపురం కోర్టుల ప్రాంగణంలో పతాకావిష్కరణ చేసిన జిల్లా న్యాయమూర్తి నరేష్



తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపీడీఓ అనుపమ



అల్లవరం ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు



యానాంలో బెలూన్లను గాల్లోకి వదులుతున్న ఎమ్మెల్యే అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- రూ.10.91 కోట్ల ఆసరా చెక్కు అందజేత
- సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళల క్షీరాభిషేకం

ముమ్మిడివరం: డ్వాక్రా అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి, వారిని రుణ విముక్తులను చేశారని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధులను విడుదల చేశారు. ముమ్మిడివరం మండలంలో 980 సంఘాలకు రూ.7,06,53,726లు, అర్బన్‌లో 467 సంఘాలకు రూ.3,74,10,068లు.. మొత్తం రూ.10.81 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సభ జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ దేశంలో ఏక్కడా లేనట్టుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో విశేష ప్రాతినిధ్యం కల్పించడమే కాకుండా, ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 5,435 డ్వాక్రా సంఘాలకు రూ.160 కోట్లు ఆసరా పథకంలో ఆర్థిక చేయూత లభించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఇంత మంచి చేసిన ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. అలాగే ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవాని, కోలా బాబ్జీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ వలీ, జగతా పద్మనాభం, కాదా గోవిందకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, రొక్కాల విజయలక్ష్మి, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు

ఐ.పోలవరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు ఉద్యోగులకు, సేవాతత్పరులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, ఏపీడీ రామారావుకు, ఎస్సై ఎస్.రాజేష్ ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. రెడ్ క్రాస్‌లో విశేష ప్రతిభ కనపరిచిన సంస్థ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ పిన్నంరాజు వెంకటపతిరాజు తదితరులకూ పురస్కారం లభించింది.

అల్లవరం: గ్రామాభివృద్ధి, నిరంతర ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన అందిస్తున్న సర్పంచ్‌లు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా శుక్రవారం పురస్కారాలు అందుకున్నారు. అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అలాగే ఉత్తమ సేవలందించిన ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్ ఉత్తమ సేవా పురస్కారాలను జేసీ నుపూర్ అజయ్ అందించారు.

తాళ్లరేవు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలానికి చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. శుక్రవారం కాకినాడలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. చొల్లంగి గ్రామంలో రైతు కట్టిమేను నూకరాజుతో సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని సమర్థంగా చేయించడంలో సేవలందించిన గ్రామ వ్యవసాయ సహాయకుడు వి.వెంకటరమణ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే చొల్లంగిలోని కోరింగా అభయారణ్యంలో విశేష సేవలందిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున, తాళ్లరేవు సీహెచ్‌సీలో ఆరోగ్య మిత్ర ఖాజా మొహిద్దీన్ అవార్డులు అందుకున్నారు.



గవర్నర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న హరిదుర్గాప్రసాద్

ఉత్తమ బీఎల్‌ఓగా తాడికోన వీఆర్‌ఓ

అల్లవరం: అల్లవరం మండలం తాడికోన గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓ ఇంటి హరి దుర్గాప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన జాతీయ ఓటరు దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. బూత్ లెవల్ పరిధిలో ఆయన చేసిన సేవలకు ఈ పురస్కారం లభించిందని తహసీల్దార్ సాంబశివప్రసాద్ అన్నారు. అవార్డు అందుకున్న హరిదుర్గా ప్రసాద్‌ను డీటీ వీరవెంకట సత్యనారాయణ, ఆర్‌ఐ దుర్గా ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, సహచర వీఆర్‌ఓలు అభినందించారు.

మత్స్యకారులకు త్వరలో నష్ట పరిహారం

యానాం: యానాం నియోజకవర్గంలోని మత్స్యకారులకు ఓఎన్‌జీసీ వేట నష్ట పరిహారం నిధులు త్వరలో వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తెలిపారు. మత్స్యకారులకు ఓఎన్‌జీసీ వేట నష్ట పరిహారం పది లేదా 15 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఈ సమస్య పరిష్కారమైందన్నారు. తమ ఖాతాల్లో పడిన డబ్బుకు ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వనవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసులకు కానీ, తనకు కానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. మత్స్యకార యువకులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాగే ఎవరి దగ్గరకూ వెళ్లకుండా, సమస్యలపై పోరాడి సాధించుకోవాలని సూచించారు.

సర్పంచ్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు



మంత్రి, కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ ఏసుబాబు. సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: విశిష్ట సేవలందిస్తున్న మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి, తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబుకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధ, జేసీ నుపూర్ అజయ్ చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకున్నారు. వీరికి అవార్డులు రావడంపై ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు అభినందించారు. అదేవిధంగా ఈదరపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ చిక్కం మహేష్‌కూ సేవా పురస్కారం లభించింది.

జన కల్యాణ్ సేవలు భేష్



జన కల్యాణ్ సొసైటీ వలంటీర్లను సత్కరిస్తున్న వెంకన్నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ వలంటీర్లు హెచ్ఐవీ రోగులకు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు అన్నారు. స్థానిక వంటెద్దువారి వీధిలో సొసైటీ వలంటీర్లకు సామూహిక సత్కార కార్యక్రమం శుక్రవారం జరిగింది. సొసైటీకి చెందిన పది మంది వలంటీర్లకు నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో జన కల్యాణ్ శ్రీనివాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జల్లి సుజాత, జి.అమల, ఎం.ధనలక్ష్మి, అత్తిలి గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కల్వకొలను ఉమ, తోట శ్రీను, కల్వకొలను బాబి, మామిడిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పద సంచలనం

తాళ్లరేవు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ యానాం, తాళ్లరేవు ఆధ్వర్యంలో శుక్రవారం పద సంచలనం, భరత్‌మాత పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ యానాం ఖండ ప్రతినిధి రామారావు నేతృత్వంలో ధనవంతుడు దినోత్సవం పురస్కరించుకుని ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు 120 మంది కర సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.